# కౌలు రైతుల సమస్యలు - పరిష్కారం

## రైతు స్వరాజ్య వేదిక - సుస్థిర వ్యవసాయ కేంద్రం

## ప్రభుత్వానికి అందిస్తున్న సూచనలు

**తేది: 22-2-2012, వేదిక : కాన్ఫరెన్స్ హాల్, ఎన్.ఐ.ఆర్.డి., రాజేంద్రనగర్, హదరాబాద్.**

రాష్ట్రంలో కౌలు రైతులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారికి అవసరమైనంత సాగుభూమి అందుబాటులో లేక పోవడంతో, కౌలు దారుల మధ్య పోటీ పెరిగి కౌలు ధరలు పెంచుకుంటూపోతున్న స్థితి కొన్ని ప్రాంతాలలో వుంది. కౌలు రైతులు రుణం, బీమా, పరిహారం, సబ్సిడీల లాంటి సంస్థాగత సౌకర్యాలేవీ అందుకోలేక పోతున్నారు. పంటల ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోవడం, మద్ధతుధరలు లభించక పోవడం తదితర కారణాలవల్ల అప్పుల పాలవుతున్నారు. అప్పుల భారం పెరిగి పోయిన నిస్సహాయ స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరిలో అత్యధికులు వెనుకబడిన కులాలు, దళితులు, ఆధిపత్యకులాలలోని పేదకుటుంబాలవారు. వీరు దేశ, రాష్ట్ర ప్రజలకు ఆహార భద్రత అందించడంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు.

ఈ సమస్యలను అందరూ గుర్తిస్తున్నా, పరిష్కారాలు సమగ్రంగా లేక పోవడంతో, కౌలు రైతులకు మేలు జరగడం లేదు. సమస్యను సమగ్రంగా అర్థం చేసుకుని పరిష్కరించవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది.

**సమస్య: 1**

కౌలు రైతులకు తగినంత సాగు భూమి అందుబాటులో లేదు. దానివల్ల కౌలుదారుల మధ్య పోటీ ఏర్పడి భూముల కౌలురేట్లు పెరుగుతూ పోతున్నాయి.

**పరిష్కారం:**

1. వ్యవసాయాన్ని వృత్తిగా ఎంచుకుని సాగు చేయాలనుకుంటున్న, ఇప్పటికే సాగు చేస్తున్న రైతులకు సాగుభూమి అందుబాటులో వుండాలి. దీనికోసం భూసంస్కరణల చట్టాన్ని సమగ్రంగా అమలు చేసి వాస్తవ సాగుదారులకు సాగు భూమిని అందించాలి.
2. వ్యవసాయేతర అవసరాలకు, వ్యవసాయ భూములను మళ్ళించడం తక్షణం ఆపాలి.
3. అభివృద్ధి ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్, పారిశ్రామిక వాడలు, సెజ్‌ల పేరుతో వ్యవసాయ భూములను సేకరించి బీడుగా పెట్టారు. అటువంటి చోట నిర్దిష్ట కాల పరిమితిలో ఆయా ప్రాంతాలలో కబ్జాదారులు ఎటువంటి కార్యకలాపాలు ప్రారంభించకపోతే, వాటిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆయా భూముల స్వంత దారులకు అప్పగించి వ్యవసాయం చేయించాలి. ఆయా ప్రాజెక్టులకు ఏ మేరకు భూమి అవసరమో శాస్త్రీయంగా నిర్ణయించి, మిగిలిన భూములను వ్యవసాయం కోసం తిరిగి అప్పగించాలి.
4. వ్యవసాయేతరులు, వ్యవసాయ భూములను కొనుగోలు చేయకుండా నిషేధం విధించాలి. ఇందుకు అనుగుణంగా తక్షణమే ఆర్డినెన్స్ తేవాలి. వచ్చే అసెంబ్లీ సమావేశాలలోపు బిల్లును రూపొందించి చట్టం చేయాలి. దీనిపై నిపుణులు, రైతు, వ్యవసాయ

### కౌలు రైతులు - కొన్ని గణాంకాలు

- ఆంధ్రప్రదేశ్ లాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ ఆర్డినెన్స్ – 2011 జారీ చేసిన తేది: 8-6-2011
- ఆర్డినెన్స్ ప్రకారం కౌలు రైతులకు జారీ చేయబడిన రుణ అర్హత గుర్తింపు కార్డులు–5,76,147 (2011 ఖరీఫ్ + రబీ)
- బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన (కార్డులు అందుకున్న) రైతులు – (32.50 శాతం) 19,326
- బ్యాంకు ద్వారా అందిన రుణం – 377 కోట్లు
- ఆర్డినెన్స్ చట్టంగా మారింది – 23-12-2011
- **ప్రభుత్వ గణాకాల ప్రకారం** రాష్ట్రంలో మొత్తం సాగు భూమి –14.51 మిలియన్ హెక్టార్లు
- సాగు నీటి సౌకర్యం ఉన్న భూమి – 49.30 శాతం
- ఆహార పంటలు సాగయ్యే భూమి – 9.73 మిలియన్ హెక్టార్లు
- వరి పంట పండే భూమి – 49 శాతం
- రాష్ట్రంలో రైతు కుటుంబాలు – 1 కోటి 20 లక్షలు
- రాష్ట్రంలో కౌలు రైతు కుటుంబాలు – 25 లక్షలు (20 శాతం)

కూలీ సంఘాలతో సమగ్రంగా చర్చించాలి. వ్యవసాయేతరుల చేతిలో ఇప్పటికే వున్న సాగుభూమిలో ఖచ్చితంగా స్వయంగా వ్యవసాయం చేసేలా, లేదా సాగు చేయాలనుకుంటున్న వారికి భూమి ఇచ్చేలా ఆర్డినెన్స్ తేవాలి.

5. దేవాదాయ భూములను, ఇతర ప్రభుత్వ భూములను ఖచ్చితంగా వ్యవసాయ కూలీలకు, సన్న, చిన్న కారు రైతులకు మాత్రమే సాగు కోసం ఇవ్వాలి. ఆయా భూముల కౌలు ధరలు చాలా నామినల్‌గా నిర్ణయించాలి.

**సమస్య: 2**

కౌలు రేట్లు విపరీతంగా పెంచుతున్నారు. ఇది కౌలు దారులపై భారాన్ని మోపడమేగాక, పంట ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నది.

**పరిష్కారం:**

1. కౌలు రేట్లు ఎంత వుండాలనేది ఆంధ్రప్రాంత కౌలు దారుల రక్షిత చట్టంలోనే వుంది. కౌలు రైతుల ప్రయోజనాలను రక్షించే అనేక అంశాలు కూడా ఈ చట్టంలో వున్నాయి. కానీ అవేమీ అమలు కావడం లేదు. దీనిని అమలు చేసేందుకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నిర్దిష్ట చర్యలు చేపట్టాలి.
2. వ్యవసాయ భూమి దేశానికి అవసరమైన ఆహారాన్ని అందించే ఉత్పాదక వనరు. దానిని ఆస్థిగా చూసే ధోరణిని అరికట్టాలి. ఆస్థి రూపంలో వ్యవసాయ భూమిని కొని, దానిని అధిక మొత్తాలకు కౌలుకు ఇచ్చే వైఖరిని అడ్డుకోవాలి. వ్యవసాయ భూమిని ఆస్థిగా చూసే ధోరణిని చట్టరిత్యా అడ్డుకుంటేనే కౌలు ధరలు అదుపులో కొస్తాయి.
3. చట్టంలో వున్న విధంగా పంట ఉత్పత్తిలో 6వ వంతు (1/6) మాత్రమే కౌలు ధరగా వుండాలనే నియమాన్ని పకడ్బందీగా క్షేత్రస్థాయిలో అమలు చేయాలి. ఎక్కువ కౌలును వసూలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.
4. ఈ చట్టాన్ని అమలు చేసే స్థితిలో ప్రభుత్వం లేకపోతే తక్షణ పరిష్కారంగా సాగుభూమి రిజిస్ట్రేషన్ విలువపై బ్యాంకు వడ్డీ వచ్చే విధంగా (ఉదా: 100 రూ॥లకు నెలకు 35 పైసలు) కౌలు రేట్ల నియంత్రణ వుండాలి. (లక్షరూపాయల విలువైన సాగు భూమికి సంవత్సరానికి 4200 రూపాయలు మాత్రమే)
5. పై రెండు ప్రతిపాదనలలో భూమి యజమానులు దేనినైనా ఒకదానిని అంగీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం కౌలుదారుడికీ, భూమి యజమానికీ మధ్య రాతపూర్వక ఒప్పందం జరగాలి. కౌలు మొత్తాన్ని బ్యాంకు ద్వారా చెల్లింపులు జరిపేలా చూడాలి. ఆహార పంటలు పండే భూములకు సంబంధించి 1/6 కౌలురేటు అమలయ్యేలా చూడాలి. వాణిజ్య పంటలు పండే భూములకు సంబంధించి బ్యాంకు వడ్డీకి సమానమైన మొత్తం వచ్చేలా చూడాలి.

**సమస్య: 3**

కౌలు దారులకు బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు. ఇందుకు కారణాలు అనేకం.

**పరిష్కారం:**

1. రాష్ట్రం మొత్తం సాగు భూమిలో వాస్తవ సాగుదారులెవరో నమోదు చేయాలి. కౌలు రైతులను కూడా నమోదు చేసి వారికి విడిగా పాస్‌బుక్‌లు ఇవ్వాలి.
2. పంట రుణాలు పూర్తిగా వాస్తవ సాగుదారులకు మాత్రమే ఇవ్వాలి.
3. ఎ) ఏ సర్వే నెంబర్‌లో ఎవరు వాస్తవ సాగుదారులుగా వున్నారో క్షేత్ర స్థాయిలో నిర్ధారణ జరగాలి. ఇందుకోసం గ్రామ పంచాయితీ అధికారిని (వి.ఇ.ఓ) బాధ్యునిగా చేయాలి. ఉల్లంఘనలు, తప్పులు జరిగితే వి.ఇ.ఓలదే బాధ్యత.

   బి) ప్రతి సీజన్ ప్రారంభంలో (జూన్ 1 నుండీ 15 వరకూ) వాస్తవ సాగుదారులను నమోదు చేసే కార్యక్రమం నిర్వహించాలి. ఇందుకోసం వి.ఇ.వో. కన్వీనర్‌గా గ్రామసర్పంచ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామ పశువైద్యుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు సభ్యులుగా కమిటీ వేయాలి.

   సి) ఏ సర్వే నెంబర్‌లో ఎవరు, ఎన్ని ఎకరాలు, ఏఏ పంటలను వేయాలనుకుంటున్నారో నిర్ధారణ జరిగాక, ఆయా వివరాలను, ఆ ప్రాంత రైతులకు రుణాలు ఇచ్చే బాధ్యత వున్న బ్యాంకులకు అందించాలి. రైతుల పాస్‌బుక్‌లలో ఆ వివరాలు నమోదు చేయాలి.

   డి) ఆయా బ్యాంకులు అప్పటికే నిర్ధారించబడిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం వాస్తవ సాగుదారులకు రుణాలను అందించాలి.

   ఇ). ఒకవేళ ఒక సర్వేనంబర్‌లో భూమి యజమాని, కౌలు దారుడు కూడా సాగుదారులుగా వుంటే, వారు సాగు చేసే భూమి విస్తీర్ణాన్ని బట్టి, రుణాలను అందించాలి.

   ఎఫ్) స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించేటప్పుడు ఇతర పంట ఉత్పత్తి ఖర్చులతోపాటు, భూమి కౌలు రేటును కూడా పరిగణనలో పెట్టుకోవాలి.

జి) జూన్ 16 నుండీ 30 వరకూ వాస్తవ సాగుదారులందరికీ రుణాలు అందించాలి. రుణాలను ఆయా బ్యాంకులో వున్న రైతుల ఖాతాలలో జమచేయాలి.

**సమస్య: 4**

కౌలు దారులకు రుణాలు ఇస్తే రికవరీ అవుతాయా? ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తే రుణాలను ఎవరు తీరుస్తారు?

**పరిష్కారం:**

1. మొత్తం బ్యాంకు ఖాతాదారులలో రైతులు (వాస్తవ సాగుదారులు) ఎప్పుడూ తక్కువగానే వుంటున్నారు. రుణాలు పొందిన రైతులు ఎక్కువ శాతం, పరిస్థితి అనుకూలంగా వుంటే రుణాలు తీర్చేస్తున్నారు. కరువులు, తుపాన్లు, వరదలు లాంటి ప్రత్యేక పరిస్థితుల్లో బ్యాంకు రుణాలను రీ షెడ్యూల్ చేస్తున్న స్థితి వుంది. బ్యాంకులకు బకాయి పడిన వారిలో ఎప్పుడూ రైతులకంటే ఇతరులే ఎక్కువ. కాబట్టి బ్యాంకులు రైతుల పట్ల అనుమానాలను వదలి సానుకూల ధోరణితో వుండి రుణాలను ఇవ్వాలి.
2. ఎటువంటి హామీ లేకుండా రైతులకు లక్షరూపాయల వరకూ రుణాలు ఇవ్వాలని ఆర్.బి.ఐ. మార్గనిర్దేశనం చేసింది. లక్షరూపాయల వరకూ వడ్డీలేని రుణం అందిస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కాబట్టి ఆయా సంస్థలు తమ వాగ్దానాలను నిలబెట్టుకునేందుకు ముందుగా పూనుకోవాలి.
3. కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలంటే బ్యాంకులకు ప్రభుత్వం కౌంటర్ గ్యారంటీ ఇవ్వాలి. ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. "ప్రభుత్వం కౌంటర్ గ్యారంటీ ఇచ్చాక, బ్యాంకులు రైతుల నుండి రుణాలు వసూలు చేయవు. రైతులు కూడా తీర్చరు." అనే అపోహ వుంది. దీనిని పరిష్కరించేందుకు ఒకే మార్గం వుంది. అది పంట రుణాలకు, పంట సేకరణకు లింక్ చేయడం.
4. కనీస మద్ధతు ధరలను ప్రకటించిన అన్ని పంటలను ప్రభుత్వం, తన ఏజన్సీల ద్వారా నేరుగా సేకరించాలి. ఇలా సేకరిస్తే, రైతులకు మద్ధతు ధరలు అందుతాయి. రైతులకు చెల్లించాల్సిన మొత్తం నుండి బ్యాంకు రుణాలను (వడ్డీ లేకుండా) మినహాయించుకుని, మిగిలిన మొత్తాలను రైతులకు చెల్లించాలి.
5. ప్రకృతి వైపరిత్యాల సమయంలో పంట పూర్తిగా నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని హుడా కమిటీ సూచించింది. ఈ మొత్తాన్ని వాస్తవ సాగుదారులకు నేరుగా చెల్లించాలి. బ్యాంకురుణాలను పూర్తిగా రీషెడ్యూల్ చేయాలి. రీషెడ్యూల్ చేసిన పీరియడ్‌కు కూడా వడ్డీ మినహాయింపును కొనసాగించాలి. పంటల నష్టపరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో కేటాయింపులు చేసి, నష్టం జరిగిన వెంటనే రైతులకు పరిహారం అందించాలి. కేంద్రం నుండి వచ్చే సహాయాన్ని తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తన అకౌంట్‌లో వేసుకోవాలి.
6. ప్రకృతి వైపరిత్యాల సమయంలో కొంత మొత్తం పంట అమ్మకం ద్వారా వస్తే దానిని 3 భాగాలుగా చేసి బ్యాంకు, భూయజమాని, వాస్తవసాగుదారు సమంగా పంచుకోవాలి. నష్టాన్ని అందరూ సమంగా భరించాలి. తరువాత పంట కాలానికి తిరిగి బ్యాంకు రుణం వాస్తవ సాగుదారుకు ఖచ్చితంగా ఇవ్వాలి.

**సమస్య: 5**

భూముల యజమానులు ఆయా సర్వే నెంబర్లపై అప్పటికే రుణాలు తీసుకుని వుంటే, తిరిగి కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం ఎలా సాధ్యం?

**పరిష్కారం:**

వాస్తవసాగు దారులకే పంట రుణాలు అందాలి. భూముల యజమానులకు ఇచ్చిన రుణాలను (పంటరుణాలు, స్వల్పకాలిక రుణాలుగా ఇచ్చినా) దీర్ఘకాలిక రుణాలుగా మార్చాలి. దీర్ఘకాలిక రుణాలకు భూములను ఎలానూ తాకట్టు పెట్టుకుంటారు. కాబట్టి 3 నుండి 5 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలానికి దీర్ఘకాలిక రుణాలుగా వాటిని మార్చాలి. ఏ సీజన్‌కు ఆ సీజన్ పంట రుణాలను మాత్రం వాస్తవ సాగు దారులకు ఇవ్వాలి.

**సమస్య: 6**

కౌలు రైతులకు బీమా సౌకర్యం, నష్ట పరిహారం అందడం లేదు.

**పరిష్కారం:**

నమోదైన కౌలు రైతులు సాగుచేసే అన్ని పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి. ఈ బీమాను 4 దశలలో (విత్తిన 30 రోజుల లోపు, సస్యరక్షణ దశలో, పంట చివరి దశలో, పంట కోతల అనంతరం) అమలు చేసేందుకు వీలుగా రాష్ట్ర

స్థాయిలో సమగ్ర బీమాపథకాన్ని ప్రభుత్వం ప్రారంభించాలి. ప్రాథమికంగా 1, 2 సంవత్సరాలు ఇందుకోసం రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి.

**సమస్య: 7**

ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోవడం వల్ల కౌలు రైతులకు ఏమీ మిగలడం లేదు? రుణాలను ఎలా తీరుస్తారు? వారి జీవితాలు ఎలా మెరుగుపడతాయి?

**పరిష్కారం:**

1. కౌలు రైతులతో సహా వాస్తవ సాగు దారులందరినీ ఉత్పత్తి దారుల సంఘాలుగా క్షేత్ర స్థాయిలో నిర్మాణం చేయాలి.
2. ప్రతి 2,500 ఎకరాలకు ఒక ఉత్పత్తి దారుల సంఘాన్ని నిర్మించాలి.
3. పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు, బీమా, సబ్సిడీ పథకాలు తదితరాలన్నిటినీ ఈ ఉత్పత్తి దారుల సంఘం ద్వారానే అందించాలి.
4. ఉత్పత్తి దారుల సంఘం పరిధిలో ప్రాసెసింగ్ యూనిట్లను, శీతల/నిల్వగిడ్డంగులను నిర్మించడం ద్వారా, రైతులు అదనపు ఆదాయం పొందే వీలు కల్పించాలి.
5. కౌలురైతులకు కూడా పశువులను అందించడం ద్వారా అదనపు ఆదాయం కల్పించాలి. ఇందుకోసం సబ్సిడీతో బ్యాంకు రుణాలను వారికి కూడా ఇవ్వాలి. పాల అమ్మకం, కంపోస్టు తయారీ, అమ్మకం తదితర కార్యకలాపాలను బ్యాంకు రుణానికి జోడించాలి.

**సమస్య: 8**

వ్యవసాయ రంగంలో ఎక్కువ మంది ఉండడం వల్ల సంక్షోభం తీవ్రంగా వుంది. వ్యవసాయంలోనే ఇంతమంది ఉపాధిపొందలేరు. ఆదాయాలు సరిపోవు.

**పరిష్కారం:**

1. మనది ప్రధానంగా గ్రామీణ దేశం. నూటికి 65 మంది వ్యవసాయం వృత్తిగా జీవిస్తున్నారు. ఈ ప్రజలందరికీ వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ద్వారా ఉపాధి లభించడమే న్యాయం. వారి ఉపాధి నుండే వారికి ఆదాయాలు పెరగాలి. దేశ ఆహార భద్రత సమస్య కూడా దీనితో ముడిపడి వుంది. కాబట్టి ప్రభుత్వ పెట్టుబడులు ఈ రంగంలో గణనీయంగా పెరగాలి. బడ్జెట్ కేటాయింపులు పెరగాలి. విస్తరణ వ్యవస్థ, పరిశోధనా రంగం క్షేత్రస్థాయి అవసరాల కనుగుణంగా మారాలి.
2. పారిశ్రామికీకరణ జరిగి, ఇతరేతర ఉపాధి అవకాశాలు మెరుగుపడితే, ఎలాగూ కొంతమంది అటువైపు తరలివెళతారు. అది ఐచ్ఛికంగా జరగాలి. బలవంతంగా వ్యవసాయ రంగం నుండి, గ్రామీణ ప్రాంతం నుండి మనుషులను బయటకు నెట్టేసేలా విధానాలు ఉండకూడదు. సంఘటితరంగంలో ఉపాధి అవకాశాలు, వాస్తవానికి తక్కువగానే ఉంటాయి. మెరుగైన ప్రత్యామ్నాయాలు చూపించకుండా గ్రామీణ ప్రజల్ని బలవంతంగా నిర్వాసితుల్ని చేయడం అన్యాయం.
4. వ్యవసాయ, దాని అనుబంధ రంగాలను, గ్రామీణ చేతి వృత్తులను (కొత్త రూపంలో) పటిష్టం చేయాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను, గ్రామీణ ప్రాంతాలలో నెలకొల్పాలి. మౌలిక వసతులు (రోడ్లు, విద్యుత్తు, గోదాములు, ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్న యంత్రాలు) కల్పించేందుకు ప్రభుత్వం పెట్టుబడులు పెట్టాలి.
5. సస్యరక్షణలో, భూసారాన్ని పెంచడంలో ప్రభుత్వం పర్యావరణ హితమైన, స్థానిక వనరులతో సాధ్యమయ్యే పద్ధతులను ప్రోత్సహించాలి. అందుకు అవసరమైన శిక్షణను, నిధులను అందించాలి. రైతులు స్వయంగా చేసుకునే సుస్థిర వ్యవసాయ పద్ధతులకు కూడా సబ్సిడీలను, సహకారాన్ని అందించాలి.

ఇంత సమగ్రంగా ఆలోచించగలిగితేనే కౌలురైతుల సమస్య పరిష్కారమవుతుంది. వారికి న్యాయం జరుగుతుంది. కేవలం గుర్తింపు కార్డులతోనే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయనుకోవడం భావ్యం కాదు.


## రైతు స్వరాజ్య వేదిక - సుస్థిర వ్యవసాయ కేంద్రం (సి.ఎస్.ఎ)

12-13-445, Street No.1, Tarnaka, Secunderabad 500017. (040)2701-7735/4302

**డా॥ జి.వి. రామాంజనేయులు : 9000699702, విస్సా కిరణ్ కుమార్ : 9701705743, కె. రవి : 9912928422**